సాక్షి
నిజామాబాద్
ఆదివారం ၊ 9 ၊ జూన్ ၊ 2024



యంత్రంతో పసుపు విత్తడం..

యంత్రంతో పసుపు విత్తనాలు విత్తడం సులభంగా ఉంటుందని రైతులు పేర్కొంటున్నారు.

- 8లో ▸



రేషన్ దందా!

బియ్యం వ్యాపారులు జిల్లా సరిహద్దు ప్రాంతాలను కేంద్రంగా చేసుకుని తమ దందాను యథేచ్ఛగా సాగిస్తున్నారు.

- 8లో ▸

వాతావరణం

గరిష్టం/కనిష్టం
39.1 /26.1

ఆకాశం పాక్షికంగా మేఘావృతమవుతుంది. వాతావరణంలో తేమ అధికంగా ఉంటుంది. అక్కడక్కడ ఉరుములు మెరుపులతో కూడిన వర్షం కురిసే అవకాశాలున్నాయి.

స్థానికంపై నజర్..

- ప్రజాపరిషత్, పంచాయతీ, మున్సిపల్ పదవులపై కాంగ్రెస్ శ్రేణుల కన్ను
- నామినేటెడ్ పదవుల కోసం ప్రయత్నాలు.. జెడ్పీ పదవులపైనా దృష్టి
- మరోవైపు స్థానిక ఎన్నికల్లో మరింత పాగా వేసేందుకు బీజేపీ ప్లాన్
- ప్రాబల్యం నిలుపుకునేందుకు బీఆర్ఎస్ ప్రయత్నాలు

రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన నేపథ్యంలో కాంగ్రెస్‌లో దశాబ్దాల తరబడి పని చేస్తున్న పార్టీ శ్రేణులు స్థానిక సంస్థల పదవులపై దృష్టి సారించాయి. మున్సిపాలిటీల్లో కార్పొరేటర్, కౌన్సిలర్ స్థానాలకు, గ్రామాల్లో సర్పంచ్ పీఠం కోసం నాయకులు పావులు కదుపుతున్నారు. బీజేపీ స్థానిక సంస్థల్లో మరింతగా పాగా వేసేందుకు ప్రణాళికతో ముందుకు వెళ్తుండగా, బీఆర్ఎస్ పట్టు నిలుపుకునేందుకు ప్రయత్నాలు చేస్తోంది.

సాక్షి ప్రతినిధి, నిజామాబాద్ : అధికార కాంగ్రెస్ పార్టీలో నామినేటెడ్ పదవుల కోసం జిల్లాకు చెందిన ముఖ్య నాయకులు ప్రయత్నాలు చేస్తున్నారు. మరోవైపు కొందరు నాయకులు నామినేటెడ్ పదవులు దక్కని పరిస్థితుల్లో జిల్లాలో కీలకమైన జిల్లా ప్రజా పరిషత్ చైర్మన్, వైస్ చైర్మన్, నిజామాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ మేయర్, డిప్యూటీ మేయర్, బోధన్, ఆర్మూర్, భీమ్‌గల్ మున్సిపాలిటీల చైర్మన్లు, వైస్ చైర్మన్లు తదితర పదవుల కోసం లెక్కలు వేసుకుంటున్నారు. ఇక ద్వితీయ, తృతీయ శ్రేణి నాయకులు, కార్యకర్తలు జెడ్పీటీసీ, ఎంపీపీ, ఎంపీటీసీ, సర్పంచ్ పదవుల కోసం పావులు కదుపుతున్నారు. అయితే ఈ పదవులకు సంబంధించి రిజర్వేషన్లు, మహిళల కోటా కేటాయింపుల నేపథ్యంలో ఎక్కడికక్కడ లెక్కలు వేసుకుంటున్నారు.



■ పదేళ్ల తర్వాత అధికారం దక్కిన నేపథ్యంలో జాతీయ పార్టీ అయిన కాంగ్రెస్‌లో దశాబ్దాల తరబడి పనిచేస్తున్న నాయకులతో పాటు, ఏళ్లతరబడి పనిచేస్తున్న సీనియర్ నాయకులు, కార్యకర్తలు సైతం స్థానిక సంస్థల పదవుల కోసం ఎదురు చూస్తున్నారు. మున్సిపాలిటీల్లోనూ అధికార పార్టీ కార్పొరేటర్, కౌన్సెలర్ టిక్కెట్టు కోసం డిమాండ్ పెరుగుతోంది. జాతీయ పార్టీలో ప్రత్యేక గౌరవం దక్కనున్న నేపథ్యంలో గ్రామాల్లోనూ అధికార పార్టీలో సర్పంచ్ పీఠం కోసం పావులు కదుపుతున్నారు.

■ పార్లమెంట్ ఎన్నికలకు ముందు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి మాట్లాడుతూ కష్టపడి పనిచేసినవారికే స్థానిక సంస్థల పదవుల్లో ప్రాధాన్యత ఇస్తామని ప్రకటించారు. ఈ నేపథ్యంలో లోక్‌సభ ఎన్నికల్లో గట్టిగానే పనిచేశారు. అయితే లోక్‌సభ స్థానం పరిధిలో ఓట్లు పెంచుకున్నప్పటికీ గెలుపు మాత్రం దక్కలేదు. దీంతో ఒకింత నిరుత్సాహం కలిగినప్పటికీ రాష్ట్రంలో అధికారం ఉండడంతో స్థానిక అధికారం కోసం ఉవ్విళ్లూరుతున్నారు. వచ్చే సెప్టెంబర్ నెలలో స్థానిక సంస్థలకు ఎన్నికలు నిర్వహించేందుకు ముఖ్యమంత్రి ఆలోచన చేస్తున్నట్లు తెలుస్తోంది. పంచాయతీ, ప్రజాపరిషత్ ఎన్నికలకు ఒకేసారి ఎన్నికలు నిర్వహించాలనే లక్ష్యంతో ఉన్నట్లు తెలుస్తోంది. దీంతో శ్రేణులు ఎదురుచూస్తున్నాయి.

గెలుపు కోసం బీజేపీ ప్రణాళికలు..

నిజామాబాద్ పార్లమెంట్ స్థానాన్ని రెండోసారి గెలిచిన బీజేపీ, గత శాసనసభ ఎన్నికల్లో సైతం ఆర్మూర్, నిజామాబాద్ అర్బన్ సీట్లను గెలుచుకుంది. పైగా గత మున్సిపల్ కార్పొరేషన్ ఎన్నికల్లో నిజామాబాద్‌లో బీజేపీ 28 సీట్లతో అతిపెద్ద పార్టీగా నిలిచింది. జిల్లాలో రెండు జెడ్పీటీసీలు, పలుచోట్ల ఎంపీటీసీలు, సర్పంచ్‌లను సైతం బీజేపీ గెలుచుకుంది. కాగా వచ్చే సాధారణ ఎన్నికల్లో రాష్ట్రంలో అధికారం దక్కించుకోవడమే లక్ష్యంగా బీజేపీ జాతీ య నాయకత్వం ప్రణాళికలు రచిస్తోంది. ఈ క్రమంలో స్థానిక సంస్థల ఎన్నికల్లో మరింతగా పాగా వేసేందుకు బీజేపీ నాయకత్వం పావులు కదుపుతోంది.

బీఆర్ఎస్ పదేళ్ల పాటు అధికారంలో ఉన్నా..

తెలంగాణ ఆవిర్భావం నుంచి వరుసగా పదేళ్లపాటు అధికారంలో ఉన్న బీఆర్ఎస్ స్థానిక ఎన్నికల్లో సింహభాగం గెలుచుకుంది. గత డిసెంబర్‌లో రాష్ట్రంలో అధికారం కోల్పోయిన తర్వాత జరిగిన తాజా లోక్‌సభ ఎన్నికల్లో బీఆర్ఎస్ భారీగా ఓట్లను కోల్పోయింది. గత అసెంబ్లీ ఎన్నికల్లో 4.17 లక్షల ఓట్లను పొందిన బీఆర్ఎస్ పార్లమెంట్ ఎన్నికల్లో మాత్రం కేవలం ఒక లక్ష ఓట్లు మాత్రమే సాధించింది. ఈ నేపథ్యంలో బీఆర్ఎస్ శ్రేణుల్లో నైరాశ్యం ఆవరించింది. ఈ నేపథ్యంలో రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో ప్రాబల్యం నిలుపుకునేందుకు ప్రయత్నాలు చేస్తోంది.

యువకుడి హత్యతో ఉద్రిక్తత



నిందితుడి ఇంటికి నిప్పు పెడుతున్న మృతుడి కుటుంబీకులు, బంధువులు

- మృతుడి బంధువుల ఆగ్రహం, నిందితుడి ఇంటికి నిప్పు
- డిచ్‌పల్లి పోలీస్ స్టేషన్ ఎదుట ఆందోళన

డిచ్‌పల్లి/ఇందల్వాయి: డిచ్‌పల్లి మండలం సీఎంసీ కళాశాల సమీపంలో ఒకరి హత్య తీవ్ర ఉద్రిక్తతకు దారితీసింది. వివరాలిలా ఉన్నాయి. ఇందల్వాయి మండలం మెగ్యానాయక్ తండాకు చెందిన లకావత్ వెంగళ్(36) గురువారం ఉదయం 10 గంటలకు ఇంట్లోనుంచి బయటకు వెళ్లి తిరిగి రాలేదు. దీంతో కుటుంబీకులు అదే రోజు ఫిర్యాదు చేయగా ఇందల్వాయి పోలీసులు విచారణ చేపట్టారు. అయితే శుక్రవారం రాత్రి డిచ్‌పల్లి సీఎంసీ సమీపంలోని చెట్ల పొదల్లో వెంగళ్ మృతదేహం లభించింది. సమీపంలోని వైన్స్ షాపు వద్ద ఉన్న సీసీ టీవీ ఫుటేజీని పరిశీలించిన పోలీసులు వెంగళ్ మెగ్యానాయక్ తండాకు చెందిన బిక్యాతో కలిసి మద్యం కొనుగోలు చేసినట్లు గుర్తించారు. ఇద్దరు కలిసి మద్యం సేవించి ఉంటారని, గొడవ జరిగి వెంగళ్ హత్యకు గురై ఉంటాడని పోలీసులు భావిస్తున్నారు. వెంగళ్‌ను హతమార్చి చెట్టుకు ఉరివేసి ఆత్మహత్యగా చిత్రికరించే ప్రయత్నం చేశాడు. పోలీసులకు అనుమానం రావడంతో శనివారం ఉదయం నిందితుడు బిక్యాను అదుపులోకి తీసుకుని విచారించారు. దీంతో తానే వెంగళ్‌ను హత్య చేశానని బిక్యా అంగీకరించినట్లు సమాచారం. ఇద్దరి మధ్య మూడెకరాల భూమి విషయంలో కొద్దిరోజులుగా తగాదా నడుస్తున్నట్లు తెలిసింది. విషయం తెలియగానే మృతుడి కుటుంబీకులు, బంధువులు బిక్యా ఇంటిపై దాడి చేసి నిప్పటించారు. ఇంట్లోని సామగ్రిని బయటపడేసి నిప్పుపెట్టారు. అడ్డువచ్చిన పోలీసులను నెట్టివేశారు. మంటలు ఇంటికి అంటుకోవడంతో చివరకు ఫైరింజన్ వచ్చి మంటలను ఆర్పివేసింది.



లకావత్ వెంగళ్(ఫైల్)

అనంతరం మృతుడి కుటుంబీకులు, బంధువులు, తండావాసులు పెద్ద సంఖ్య లో డిచ్‌పల్లి పోలీస్ స్టేషన్‌కు వెళ్లి ఆందోళన చేపట్టారు. వెంగళ్ హత్యలో బిక్యాకు సహకరించిన వారందరినీ పట్టుకుని శిక్షించాల ని డిమాండ్ చేశారు. న్యాయం జరిగే వరకు మృతదేహానికి అంత్యక్రియలు చేసేది లేదని స్పష్టం చేశారు. డిచ్‌పల్లి సీఐ మల్లేశ్, ఎస్సై మహేశ్ ఉన్నతాధికారులకు సమాచారం ఇవ్వడంతో నిజామాబాద్ ఏసీపీ రాజా వెంకట్ రెడ్డి, వన్‌టౌన్ ఎస్‌హెచ్‌వో విజయ్‌బాబు డిచ్‌పల్లికి చేరుకున్నారు. తండా పెద్దలతో మాట్లాడి మృతుడి బంధువులను సముదాయించారు. నిందితులకు శిక్షపడేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇవ్వడంతో తండావాసులు ఆందోళన విరమించారు. శనివారం రాత్రి వెంగళ్ అంత్యక్రియలు నిర్వహించారు. మృతుడి భార్య అనిత ఫిర్యాదు మేరకు డిచ్‌పల్లి పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



పీఎస్ ఎదుట ఆందోళన చేస్తున్న బంధువులు

న్యూస్‌రీల్

ప్రారంభమైన ఈసెట్ కౌన్సెలింగ్

నిజామాబాద్ అర్బన్: నగరంలోని పాలిటెక్నిక్ కళాశాలలో ఈసెట్ మొదటి విడత కౌన్సెలింగ్ శనివారం ప్రారంభమైంది. కౌన్సెలింగ్‌కు హాజరయ్యే విద్యార్థులు ఈనెల 11 వ తేదీ వరకు సంబంధిత విద్యార్థులు స్లాట్ బుక్ చేసుకోవాలన్నారు. అనంతరం పదో తేదీ నుంచి 12వ తేదీ వరకు ధ్రువపత్రాల పరిశీలన జరుగుతుందన్నారు. అనంతరం నచ్చిన కళాశాలను ఎంపిక చేసుకోవడం ఈ నెల 18న సీట్ల కేటాయింపు జరుగుతుందని చెప్పారు.

వేం నరేందర్‌రెడ్డిని కలిసిన కాంగ్రెస్ నేతలు



సాక్షి ప్రతినిధి, నిజామాబాద్: రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు వేం నరేందర్‌రెడ్డిని శనివారం హైదరాబాద్‌లో జిల్లాకు చెందిన పీసీసీ ప్రధాన కార్యదర్శి గడుగు గంగాధర్, పీసీసీ డెలిగేట్ బాడ్సి శేఖర్‌గౌడ్, పీసీసీ అధికార ప్రతినిధి బాస వేణుగోపాల్ యాదవ్ మర్యాదపూర్వకంగా కలిశారు. నామినేటెడ్ పదవుల అంశం నడుస్తున్న నేపథ్యంలో వీరి కలయిక ప్రాధాన్యత సంతరించుకుంది.

ప్రధాని మోదీ ప్రమాణ స్వీకారానికి జిల్లా నాయకులు

సుభాష్‌నగర్: దేశ ప్రధానిగా మూడోసారి నరేంద్ర మోదీ ఆదివారం ప్రమాణ స్వీకారం చేయనున్న నేపథ్యంలో.. కార్యక్రమానికి జిల్లా నాయకులకు ఆహ్వానం లభించింది. ఈమేరకు నిజామాబాద్ ఎంపీ అర్వింద్ ధర్మపురి నాయకత్వంలో శనివారం ఢిల్లీకి బయల్దేరి వెళ్లారు. మోదీ ప్రమాణస్వీకార కార్యక్రమానికి ఆహ్వానం అందిన వారిలో నిజామాబాద్ అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ, బీజేపీ రాష్ట్ర కార్యదర్శి పల్లె గంగారెడ్డి, జిల్లా అధ్యక్షుడు దినేష్ కులాచారి, వివిధ పార్లమెంట్ నియోజకవర్గ ప్రభారీలు పెద్దోళ్ల గంగారెడ్డి, బస్వా లక్ష్మీనర్సయ్య, అల్జాపూర్ శ్రీనివాస్ ఉన్నారు.

ప్రైవేట్ ఆస్పత్రుల్లో డీఎంహెచ్‌వో తనిఖీలు



నిజామాబాద్‌నాగారం: జిల్లా కేంద్రంలోని శనివారం పలు ప్రైవేట్, మల్టీస్పెషాలిటీ ఆస్పత్రుల్లో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ తుకారాం రాథోడ్ తనిఖీలు శనివారం చేపట్టారు. నగరంలోని ఖలీల్ వాడిలో గల విష్ణు ఫెర్టిలిటీ హాస్పిటల్, మెడికేర్ హాస్పిటల్, కోణార్క్ హాస్పిటల్, లైఫ్‌లైన్ హాస్పిటళ్లలో బృందాలు సర్వే చేస్తుండగా ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆస్పత్రుల్లో సౌకర్యాలు ఉన్నాయా.. నియమ, నిబంధనలను పాటిస్తున్నారా అని పరిశీలించారు. ఆస్పత్రులకు సంబంధించిన పూర్తిస్థాయిలో నివేదికను తయారు చేస్తున్నట్లు తెలుస్తోంది. అతి త్వరలో ఎలాంటి చర్యలు తీసుకుంటారో వేచిచూడాల్సిందే. ఆయన వెంట డిప్యూటీ డీఎంహెచ్‌వో అంజనాదేవి, హెచ్‌ఈవో సంతోష్, ఆరోగ్య కార్యకర్తలు శ్రీధర్, రఘు తదితరులున్నారు.

మరింత పెరిగిన టమాట ధర



బాల్కొండ: టమాట ధర మరింత పెరిగింది. వారం రోజుల క్రితం నుంచి 25 కిలోల బాక్సు ధర రూ. 400 ఉండగా రెండు రోజుల నుంచి రూ. 600కు పెరిగింది. దీంతో టమాట రైతుకు స్వల్ప ఊరట లభించింది. టమాట పంట ప్రస్తుతం చివరి దశలో ఉందని.. ఇప్పటికైనా మంచి ధర దక్కుతుందని రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. మదనపల్లిలో టమాట బాక్సు ధర రూ. వెయ్యి పలుకుతుండగా.. మన ప్రాంతంలో మాత్రం రూ. 600 మాత్రమే పలుకుతోందని రైతులు చెబుతున్నారు. మన ప్రాంతంలో సాగు చేస్తున్న టమాట అంత నాణ్యత ఉండదని అందుకే తక్కువ ధర లభిస్తోందని వ్యాపారులు చెబుతున్నారు. అంతే కాకుండా టమాట సైజ్‌లో కూడా తేడా ఉంటుందని పేర్కొంటున్నారు.

రాజీ మార్గంలోనే కేసుల పరిష్కారం

- జిల్లా జడ్జి సునీత కుంచాల
- లోక్‌అదాలత్‌లో 16,832 కేసుల పరిష్కారం
- భూ నష్టపరిహారంగా రూ. 6.11 కోట్లు అందజేత



సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా జడ్జి సునీత

ఖలీల్‌వాడి: లోక్‌అదాలత్ ద్వారా రాజీ మార్గంలో కేసులకు సత్వర పరిష్కారం లభిస్తుందని జిల్లా జడ్జి సునీత కుంచాల అన్నారు. శనివారం జిల్లా కోర్టులోని డీఎల్ఎస్ఏ భవనంలో లోక్ అదాలత్ న్విహించగా జడ్జి ప్రారంభించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ కేసులను పరిష్కారం చేసుకోవడం వల్ల ఇరువర్గాల మధ్య విబేధాలు తొలగిపోతాయని పేర్కొన్నారు. లోక్ అదాలత్‌లో నిజామాబాద్ అదనపు జిల్లా కోర్టులో న్యాయ విచారణలో ఉన్న భూనష్టపరిహారం కేసు పరిష్కారమైంది. జిల్లా జడ్జితో పాటు అదనపు జిల్లా జడ్జి కనకదుర్గ ఇరువర్గాలతో చర్చించి కేసును కొలిక్కి తీసుకువచ్చారు. నగరానికి చెందిన నారాయణరావుకు సంబంధించిన ఏడెకరాల భూమి కేసును పరిష్కరించి ప్రభుత్వం తరపున రూ. 6.11 కోట్ల చెక్కును ఇప్పించారు. జిల్లా జడ్జి, అదనపు కలెక్టర్ కిరణ్‌కుమార్ చెక్కును అందజేశారు. కాగా లోక్ అదాలత్‌లో భాగంగా నిజామాబాద్, ఆర్మూర్, బోధన్‌లో 16,832 కేసులు పరిష్కారమయ్యాయి. ఇందులో క్రిమినల్ కేసులు 6500, యాక్సిడెంట్ కేసులు 30, సివిల్ కేసులు 9 వేలతో పాటు ఇతర కేసులు ఉన్నాయి. కార్యక్రమంలో డీఎల్ఎస్ఏ కార్యదర్శి పద్మావతి, ప్రభుత్వ న్యాయవాది శ్రీహరి ఆచార్య పాల్గొన్నారు.

పండిత్‌లకు పదోన్నతులు

నిజామాబాద్‌అర్బన్: జిల్లా విద్యాశాఖలో లాంగ్వేజ్ పండిత్‌లకు స్కూల్ అసిస్టెంట్లుగా పదోన్నతులు కల్పించనున్నారు. ఇందుకు సంబంధించి ప్రక్రియను శనివారం ప్రారంభించారు. జిల్లా వ్యాప్తంగా లోకల్ బాడీస్ విభాగంలో తెలుగు పండితులు 195, హిందీ పండితులు 176, ఉర్దూలో 12 మందికి పోస్టుల్లో పదోన్నతి కల్పించనున్నారు. ప్రభుత్వ విభాగంలో తెలుగు పండితులు 23, హిందీ పండితులు 16, ఉర్దూ పండితులు 16 మందికి ప్రమోషన్ ఇవ్వనున్నారు. ప్రభుత్వ విభాగంలో 2017 డీఎస్సీ వరకు చెందిన అభ్యర్థులకు ఈ అప్‌గ్రేడేషన్ వర్తించనుంది. లోకల్ బాడీస్ విభాగంలో 2008 డీఎస్సీ వరకు టీచర్లకు ఈ అవకాశం లభించింది. కాగా సోమవారం ధ్రువపత్రాల పరిశీలన చేపట్టి.. మంగళవారం అభ్యంతరాల స్వీకరించనున్నారు. బుధవారం తుది జాబితాను ప్రకటిస్తారు. అనంతరం అర్హులైన ఉపాధ్యాయులకు పోస్టింగులు కేటాయించనున్నారు. పదోన్నతులకు సంబంధించి విద్యాశాఖ సినీయారిటీ జాబితాను శనివారం రాత్రి విడుదల చేసింది. పదోన్నతి పొందే 267 మంది ఉపాధ్యాయులతో జాబితాను రూపొందించారు.

నేడు గ్రూప్-1 ప్రిలిమ్స్ పరీక్ష

- ఏర్పాట్లు పూర్తి చేసిన అధికారులు
- హాజరుకానున్న 12,833 మంది అభ్యర్థులు
- 41 కేంద్రాల్లో పరీక్ష నిర్వహణ

నిజామాబాద్‌అర్బన్: జిల్లాలో ఆదివారం నిర్వహించనున్న గ్రూప్-1 ప్రిలిమ్స్ పరీక్షకు అధికారులు ఏర్పాట్లు పూర్తిచేశారు. మొత్తం 12,833 మంది అభ్యర్థులు పరీక్ష రాయనున్నారు. ఇందుకోసం జిల్లాలో 41 సెంటర్లు ఏర్పాటు చేశారు. పరీక్ష నిర్వహణ కోసం 41 మంది చీఫ్ సూపరింటెండెంట్లు, 41 మంది అబ్జర్వర్లు, 41 మంది డిపార్ట్‌మెంట్ ఆఫీసర్లను కేటాయించారు. 96 మంది బయోమెట్రిక్ ఇన్విజిలేటర్లు, 140 మంది ఐడెంటిటీ ఆఫీసర్లు, 12 మంది బయోమెట్రిక్ సూపర్‌వైజర్లు, 8 మంది స్క్వాడ్ అధికారులు వీరితో పాటు సుమారు 650 మంది ఇన్విజిలేటర్లు పరీక్ష నిర్వహణలో పాల్గొననున్నారు. ఎన్‌టీయూ నుంచి ఒకరు ప్రత్యేక పరిశీలకుడు, టీజీఎస్పీ నుంచి మరొక ప్రత్యేక పరిశీలన చేపట్టనున్నారు. కేంద్రాల్లో అన్ని సౌకర్యాలు ఉండేలా జాగ్రత్తలు తీసుకున్నట్లు కో-ఆర్డినేటర్ రాంమోహన్‌రెడ్డి తెలిపారు.

ఉదయం 10 గంటలు దాటితే నో పర్మిషన్

పరీక్ష ఉదయం 10.30 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు జరగనుంది. అభ్యర్థులను ఉదయం 9 గంటలకే కేంద్రంలోకి అధికారులు అనుమతించనున్నారు. 10 గంటలు దాటితే పరీక్ష కేంద్రంలోకి అనుమతి నిరాకరించనున్నారు. బయోమెట్రిక్ విధానం, హాల్ టికెట్ల పూర్తిస్థాయి పరిశీలన తదితర అంశాలు ఉండడంతో గంటన్నర ముందుగానే అభ్యర్థులను పరీక్ష హాల్‌లోకి అనుమతిస్తారు. హాల్ టికెట్‌పై అభ్యర్థుల లేటెస్ట్ ఫొటో కచ్చితంగా అతికించి ఉండాలి. అంతేగాక తప్పనిసరి గుర్తింపు కార్డు కూడా వెంట తీసుకువెళ్లాల్సి ఉంటుంది. వీటన్నింటిని పూర్తిగా పరిశీలన చేసిన తర్వాతే అభ్యర్థులను పరీక్ష కేంద్రంలోకి అనుమతించనున్నారు.

తడి నేలలు సాగుకు అనుకూలం

డొంకేశ్వర్(ఆర్మూర్): జిల్లాలో తొలకరి జల్లులు కురిసినప్పటికీ నేలలో తేమశాతాన్ని చూసుకొని విత్తనాలు విత్తుకోవాలని జిల్లా వ్యవసాయాధికారి వాజిద్ హుస్సేన్ రైతులకు సూచించారు. భూమి లోపల వేడి తగ్గకముందే విత్తనాలు వేస్తే మాడిపోయి మొలకలు రాకపోవచ్చన్నారు. తేలికపాటి భూముల్లో ఆరు సెంటీమీటర్లు, బరువు నేలల్లో ఏడు సెంటీమీటర్ల వర్షం పడితే వ్యవసాయానికి నేల అనుకూలిస్తుందని తెలిపారు. శనివారం నిర్వహించిన 'సాక్షి' ఫోన్‌ఇన్‌లో ఆయన మాట్లాడారు. వానాకాలం సాగులో విత్తనాల ఎంపిక, ఏ సమయంలో విత్తనాలు వేయాలి, ఎరువులు, మందుల వాడకం, ఏ భూముల్లో ఎలాంటి పంటలు వేయాలి, వరిలో సన్నాలకు ప్రభుత్వ బోనస్ విషయాలపై రైతులు అడిగిన ప్రశ్నలకు డీఏవో సమాధానాలిచ్చారు. నారు పోయడానికి మధ్య, స్వల్పకాలిక రకాలు మేలని, ఆగస్టు మొదటి వారం వరకు నాట్లు వేసుకోవచ్చని చెప్పారు. మక్క జూలై 15 వరకు, సోయా ఈ నెలాఖరు వరకు వేసుకోవడానికి సమయం ఉన్నట్లు పేర్కొన్నారు. అలాగే జిల్లాలో ఎరువుల నిల్వలు సమృద్ధిగా ఉన్నాయని పేర్కొన్నారు. రైతులకు ఇప్పటి వరకు 6,383 క్వింటాళ్ల జీలుగ విత్తనాలు పంపిణీ చేసినట్లు చెప్పారు.



- తొలకరి జల్లులతో భూమిలో వేడి తగ్గదు
- తేమను చూసుకొని విత్తనాలు విత్తుకోవాలి
- వరినారు పోసేందుకు మధ్య, స్వల్పకాలిక రకాలు అనుకూలం
- ఫోన్ ఇన్‌లో డీఏవో వాజిద్ హుస్సేన్

✤ నారుమడి ఎండకుండా ఎలాంటి చర్యలు తీసుకోవాలి..?

– రాజేందర్, డొంకేశ్వర్

■ నేలలో వేడి లేకుండా చూసుకోవాలి. భూమిలో నీటి తేమ ఉంటే నారుకు ఎలాంటి ప్రమాదం ఉండదు. ఎండలు బాగా ఉంటే నారుమడిపై షెడ్‌నెట్ ఏర్పాటు చేసి ఎప్పటికప్పుడు నీటిని అందించాలి. సేంద్రీయ ఎరువు వాడితే మరింత మంచిది. దీంతో నారు బలంగా పెరుగుతుంది.

✤ అమ్మోనియం సల్ఫేట్ అందుబాటులో ఉందా?

– బాలాగౌడ్, దూద్‌గాం, మెండోరా మండలం

డీఏవో: జిల్లాలో అమ్మోనియం సల్ఫేట్‌ను రైతులు పెద్దగా వినియోగించడం లేదు. దానికి బదులు యూరియానే వాడుతున్నారు. డీలర్లు కూడా దానిని తెచ్చేందుకు ఆసక్తి చూపడం లేదు. అయినప్పటికీ జిల్లాలో ఏయే ప్రాంతాల్లో అమ్మోనియం సల్ఫేట్ అందుబాటులో ఉందో తెలుసుకుని రైతులకు తెలియజేస్తాం.

✤ సన్నాలకు బోనస్ ఇస్తారా..?

– శ్రీధర్ రెడ్డి, నల్లవెల్లి, ఇందల్వాయి మండలం

■ వరిలో సన్నరకాలు సాగు చేస్తున్న వారికి బోనస్ ఇస్తామని ప్రభుత్వం ప్రకటన చేసినప్పటికీ దానిపై ఇప్పటి వరకు స్పష్టమైన ఆదేశాలు రాలేదు. మార్గదర్శకాలు ఎలా ఉంటాయో చెప్పలేం. వస్తే వెంటనే రైతులకు తప్పకుండా తెలియపరుస్తాం.

✤ నారు ఎప్పటిదాకా పోసుకోవచ్చు..?

– రాజు, సిర్పూర్, డొంకేశ్వర్ మండలం

■ దీర్ఘకాలిక రకాల కు జూన్ 20 వరకు, మధ్యకాలిక రకాలకు జూన్ 20 నుంచి జూలై 15 వరకు, స్వల్పకాలిక రకాలకు జూలై నెలాఖరు వరకు వరినారు పోసుకోవచ్చు. మరీ ఆలస్యమైతే ఆగస్టు మొదటి వారం వరకు కూడా నారు పోసుకోవడానికి అవకాశం ఉంది. నెల రోజుల తర్వాత నాట్లు వేసుకోవాలి. నాట్లు వేసేముందు 3జీ గులికలు చల్లాలి.

✤ పసుపు సాగులో సలహాలివ్వండి..?

– శ్రీనివాస్, మైలారం, ధర్పల్లి మండలం

■ నేలలో పది సెంటీమీటర్ల వరకు నీటి తేమ ఉంటే బయటపడకుండా పసుపు విత్తనాలు వేసుకోవచ్చు. ఒకవేళ విత్తనాలు వేసి ఉంటే వర్షాలు సమయానికి పడకపోతే బోరు ద్వారా నీటిని అందించాలి. సేంద్రీయ ఎరువులు మాత్రమే వాడి ఎప్పటికప్పుడు సస్యరక్షణ చర్యలు చేపట్టాలి.



✤ సోయాలో తెగుళ్లను తట్టుకునే రకాలున్నాయా?

– లింగారెడ్డి, రెంజర్ల, ముప్కాల్ మండలం

■ గతేడాది సోయాను తెగుళ్లు ఆశించడంతో ఆర్మూర్, బాల్కొండ డివిజన్లలో దిగుబడి తగ్గిపోయింది. అయితే, యాజమాన్య పద్ధతులు పాటించి జూలై నెలాఖరు వరకు సోయాను విత్తుకోవచ్చు. బాసర, భీమ్, కరిష్మా లాంటి రకాలు మంచి విత్తనాలే. సోయా వద్దనుకుంటే పంట మార్పిడికి వెళ్లడం ఉత్తమం.

✤ వరి విత్తనాలు నానబెట్టుకోవచ్చా..?

– సంజీవ్, గడ్కోల్, సిరికొండ మండలం

■ నారు కోసం విత్తనాలను సంచుల్లో నానబెట్టుకోవడానికి ఇది సరైన సమయమే. ఈ పద్ధతిలో సీడ్ ట్రీట్‌మెంట్ చేయాలి. కార్బండైజుమ్ లిక్విడ్‌ను నీళ్లలో కలిపి విత్తనాలు తీయాలి. ఇలా చేయడం వలన విత్తనాలు రోగాలను తట్టుకునే శక్తి వస్తుంది.

✤ వరిలో ఏ విత్తనాలు మేలు..?

– నోముల రాజు, నల్లవెల్లి, ఇందల్వాయి మండలం

■ సన్న రకాల్లో చూసుకుంటే డబ్ల్యూజీఎల్-962, కేఎన్ఎం-1638, డబ్ల్యూజీఎల్44(సిద్ధి), బీపీటీ-5204, తెలంగాణ సోనా, లాంటి విత్తనాలు మంచివని చెప్పవచ్చు. అలాగే దొడ్డు రకాల్లో 1010తో పాటు కేఎన్ఎం-118, జేజీఎల్-24423, ఇతర రకాలు కూడా మంచి దిగుబడులు ఇస్తాయి.

✤ చౌడు భూమిలో ఏయే పంటలు సాగు చేయవచ్చు?

– సాగర్, నికాల్‌పూర్, డొంకేశ్వర్ మండలం

■ చౌడుగా భూమిలో ఎలాంటి పంటలు సాగు చేయాలో తెలుసుకోవాలంటే ముందుగా నేల గుణాన్ని తెలుసుకోవాలి. మట్టి నమూనాలను మార్కెట్ యార్డులోని పరీక్ష కేంద్రానికి తీసుకెళ్లాలి. వారు పరీక్షలు చేసి సూచనలు చేస్తారు. వరిసాగు చేయాలనుకుంటే ఇలాంటి భూముల్లో ముందుగా జీలుగ విత్తనాలు వేయాలి.

✤ సోయా, మక్క విత్తుకోవచ్చా..?

– రొడ్డ మురళి, మాయాపూర్, నందిపేట్ మండలం

■ ఇప్పుడున్న పరిస్థితుల్లో జిల్లాలో తొలకరి వర్షాలే పడ్డాయి. మరో రెండు వర్షాలు పడితే సోయా, మక్కను భేషుగ్గా విత్తుకోవచ్చు. జూలై నెలాఖరు వరకు మక్క, జూలై 10లోపు సోయాను వేస్తే మంచి దిగుబడులు వస్తాయి.

క్లుప్తంగా

గ్లోబల్ రైస్ సమ్మిట్‌లో జైతాపూర్ రైతు



ఎడపల్లి: హైదరాబాద్‌లో నిర్వహించిన గ్లోబల్ రైస్ సమ్మిట్‌లో మండలంలోని జైతాపూర్ గ్రామానికి చెందిన రైతు పాపారావు శనివారం పాల్గొన్నారు. ఈ సమ్మిట్‌లో సేంద్రియ వ్యవసాయంపై వివరించారు. పాపారావు ఇప్పటికే జైతాపూర్‌లో 5 ఎకరాలలో పంట సాగు చేస్తున్నారు. సేంద్రియ వ్యవసాయంతో తాను సాగు చేస్తున్న వరి పంట విధానాన్ని వివరించారు. అనంతరం నిర్వాహకులు పాపారావు అభినందించారు.

'గురుకుల' పోస్టుల భర్తీకి దరఖాస్తుల ఆహ్వానం

నిజామాబాద్ అర్బన్: నగరంలోని మైనారిటీ గురుకుల బాలికల కళాశాలలో అవుట్ సోర్సింగ్ విధానంలో జూనియర్ లెక్చరర్ పోస్టులు భర్తీ చేస్తున్నట్లు ప్రిన్సిపాల్ రాజశ్రీ ఒక ప్రకటనలో తెలిపారు. గణితం, రసాయన, జంతు శాస్త్రం, ఇంగ్లిష్ బోధించడానికి ఆసక్తిగల అభ్యర్థులు ఈనెల 12వ తేదీలో పు దరఖాస్తు చేసుకోవాలన్నారు. పీజీ, డిగ్రీ బీఎడ్ చేసిన వారు అర్హులని తెలిపారు.వివరాలకు 83286 18748 నంబర్‌ను సంప్రదించాలని సూచించారు.

జువాలజీ పోస్టుకు..

ఆర్మూర్‌టౌన్: మామిడిపల్లిలో ఉన్న మైనార్టీ బాలికల రెసిడెన్షియల్ జూనియర్ కళాశాలలో జువాలజీ సబ్జెక్టు బోధించేందుకు అవుట్ సోర్సింగ్ పోస్టుకు అర్హులైన వారి నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ నహీదా ఫిర్దౌజ్ శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. అర్హులైన అభ్యర్థులు ఈనెల 10వ తేదీలోగా కళాశాలలో దరఖాస్తులను సమర్పించాలని కోరారు.

ఖాళీ సీట్ల భర్తీకి..

నిజామాబాద్ అర్బన్: నగరంలోని మైనారిటీ బాలికల, బాలుర పాఠశాల/కళాశాలల్లో ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్స్ రాజశ్రీ, బషిరుద్దీన్ వేర్వేరు ప్రకటనల్లో తెలిపారు. బాలుర పాఠశాలలో ఐదో తరగతిలో 8 సీట్లు, ఏడో తరగతిలో 12 సీట్లు, ఇంటర్ ఫస్టియర్ ఎంపీసీ, బైపీసీలో 23 సీట్లు ఖాళీగా ఉన్నాయని వివరించారు. బాలికల పాఠశాలలో కూడా మిగిలిన సీట్లను భర్తీ చేస్తున్నట్లు ప్రిన్సిపాల్ తెలిపారు.

లోక్‌అదాలత్ విజయవంతం

కామారెడ్డి క్రైం : జిల్లాలోని కామారెడ్డి, ఎల్లారెడ్డి, బాన్సువాడ, బిచ్కుంద కోర్టులలో శనివారం నిర్వహించిన జాతీయ లోక్ అదాలత్‌లో మొత్తం 3,819 కేసులను పరిష్కరించారు. వాటిలో 3,793 క్రిమినల్ కేసులు, 19 సివిల్ కేసులున్నాయి. ఒక్క కామారెడ్డి కోర్టులోనే 2,350 కేసులు పరిష్కారం అయ్యాయి. కామారెడ్డిలో జిల్లా జడ్జి వరప్రసాద్, అదనపు జిల్లా జడ్జి లాల్ సింగ్ శ్రీనివాస్ నాయక్, సీనియర్ సివిల్ జడ్జి టీ.నాగరాణిల ఆధ్వర్యంలో కేసులను పరిష్కరించారు. ఈ సందర్భంగా జిల్లా జడ్జి వరప్రసాద్ మాట్లాడుతూ.. లోక్ అదాలత్ లో సివిల్ కేసులు, రాజీపడదగిన క్రిమినల్, అన్ని రకాల కేసులను ఇరుపక్షాల ఆమోదంతో రాజీపద్ధతిన సత్వర పరిష్కారానికి అవకాశం ఉంటుందన్నారు. ప్రీ లిటిగేషన్ కేసులను కూడా పరిష్కరించుకోవచ్చని సూచించారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ జూనియర్ సివిల్ జడ్జి కే. సుధాకర్, అడిషనల్ జ్యూడీషియల్ ఫస్ట్ క్లాస్ మేజిస్ట్రేట్ దీక్ష, ఏఎస్పీ నర్సింహా రెడ్డి, పీపీ లు రాజగోపాల్ గౌడ్, అశోక్ శివరాం, నిమ్మ దామోదర్ రెడ్డి, న్యాయవాదులు రమేష్ చంద్, మోహన్ రావు, చిరంజీవి, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు శ్రీకాంత్‌గౌడ్, జిల్లా కోర్టు అడ్మినిస్ట్రేటివ్ ఆఫీ సర్ శ్రీదేవి, సూపరింటెండెంట్ చంద్రసేన్ రెడ్డి, అధికారులు భుజంగ రావు, వెంకట్ రెడ్డి, శ్రీధర్, సిబ్బంది పాల్గొన్నారు.

సరిహద్దు కేంద్రంగా రేషన్ దందా!

- జిల్లా సరిహద్దులోని కొడిచర్లలో భారీగా పీడీఎస్ బియ్యం పట్టివేత
- పేదల బియ్యంపై పెద్దల కన్ను
- పీడీ యాక్ట్ నమోదు చేసినా వెనక్కి తగ్గని వ్యాపారులు



కొడిచర్ల శివారులో పీడీఎస్ బియ్యం లభ్యమైన రైస్‌మిల్

బాల్కొండ: రేషన్ బియ్యాన్ని వేరే రాష్ట్రాలకు తరలించేందుకు వీలుగా బియ్యం వ్యాపారులు జిల్లా సరిహద్దు ప్రాంతాలను కేంద్రంగా చేసుకుని తమ దందాను యథేచ్ఛగా సాగిస్తున్నారు. గత పది రోజుల క్రితం మెండోరా మండలం కొడిచర్ల గ్రామ శివారులోని ఓ రైస్ మిల్లుపై టాస్క్‌ఫోర్స్ సిబ్బంది దాడి చేయగా 130 క్వింటాళ్ల పీడీఎస్ బియ్యం పట్టుబడ్డాయి. అంటే పరిస్థితి ఎలా ఉందో అర్థం చేసుకోవచ్చు. రైస్ మిల్లునే అడ్డగా చేసుకుని ఎవరికీ అనుమానం రాకుండా దందాను గత కొన్నాళ్లుగా సాగిస్తున్నట్లు తెలుస్తోంది.

పల్లెల్లో కొనుగోలు చేసి..

రేషన్ బియ్యాన్ని పల్లెల్లో కొనుగోలు చేసి మోపెడ్ వాహనాలపై తరలిస్తూ ఓ చోట నిల్వ చేస్తున్నారు. పల్లెల్లో కిలోకు రూ.18కి ఎచిన్న వ్యాపారులు కొనుగోలు చేసి రూ.21కి బడా వ్యాపారులకు అమ్ముతున్నారు. అనంతరం బడా వ్యాపారులు బియ్యాన్ని వాహనాల్లో లోడ్ చేసి మహారాష్ట్ర ప్రాంతానికి తరలిస్తున్నారు. ఇందుకోసం సులభంగా ఉంటే నిజామాబాద్, నిర్మల్ జిల్లాల సరిహద్దు ప్రాంతాన్ని అడ్డాగా చేసుకున్నారు. రెండు జిల్లాల మధ్య గోదావరి మాత్రమే అడ్డుగా ఉంది. దీంతో గోదావరి అంచున ఉన్న కొడిచర్ల గ్రామాన్ని ఎంచుకుని అక్కడ బియ్యం నిల్వ చేయడం ప్రారంభించారు.

గతంలో పలు కేసులు

రేషన్ బియ్యాన్ని కొనుగోలు చేసి ఇతరప్రాంతాలకు తరలిస్తున్న పలువురిపై గతంలో కేసులు నమోదయ్యాయి. కొందరిపై పీడీ యాక్టు సైతం నమోదు చేసినప్పటికీ దందాను మాత్రం ఆపలేదు. గతంలో బాల్కొండ మండల కేంద్రంతోపాటు మెండోరా మండలం బుస్సాపూర్‌ను కేంద్రంగా రేషన్ దందాను కొనసాగించారు. ఓ వైపు కేసులు నమోదువుతున్నా మరోవైపు బియ్యం అక్రమ దందా కొనసాగుతూనే ఉండంతో అధికారుల కనుసన్నల్లోనే ఇదంతా జరుగుతోందనే ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి. ఉన్నతాధికారులు స్పందించి గత పది రోజుల క్రితం పట్టుబడిన బియ్యంపై పూర్తి విచారణ చేపట్టాలని పలువురు డిమాండ్ చేస్తున్నారు.

బాల్కొండ మండల కేంద్రంలో..

బాల్కొండ మండల కేంద్రంలోని ఓ కిరాణాదుకాణంపై ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు శుక్రవారం దాడిచేసి 19 క్వింటాళ్ల పీడీఎస్ బియ్యాన్ని పట్టుకున్నారు. బాల్కొండ మండల కేంద్రంలో రేషన్ బియ్యం దందా జోరందుకుందనేందుకు ఈ ఘటనే నిదర్శనమనే అభిప్రాయం సర్వత్రా వ్యక్తమవుతోంది. రేషన్ పంపిణీ చేసిన నెలలో మొదటి పదిరోజులపాటు దాడులు చేస్తే అధికారులకు రేషన్ బియ్యం కుప్పలుగా పట్టుబడుతుందని పలువురు అంటున్నారు.

చర్యలు తీసుకుంటున్నాం

రేషన్ బియ్యం తరలించే వారిపై చర్యలు తీసుకుంటున్నాం. పీడీఎస్ బియ్యం నిల్వలు ఉన్నట్లు సమాచారం అందితే వెంటనే చర్యలు తీసుకుంటున్నాం. ఎక్కడైనా రేషన్ బియ్యం నిల్వ చేసినట్లు తెలిస్తే వెంటనే మాకు సమాచారం అందించాలి.

– శ్రీనివాస్, డీటీ ఎన్‌ఫోర్స్‌మెంట్, నిజామాబాద్

పూర్వ విద్యార్థుల సమ్మేళనం



ఆత్మీయ సమ్మేళనానికి హాజరైన పూర్వ విద్యార్థులు

వేల్పూర్: మండలంలోని సాహెబ్‌పేట్ గ్రామ ప్రైమరీ స్కూల్‌లో 2003–04 విద్యా సంవత్సరంలో ఐదో తరగతి చదివిన వి ద్యార్థులు శనివారం ఆత్మీయ సమ్మేళనాన్ని నిర్వహించారు. ఆటపాటలో ఉల్లాసంగా గడిపి చిన్ననాటి జ్ఞాపకాలను నెమరువేసుకున్నారు. తమకు విద్యాబుద్ధులు బోధించిన గురువులు జంగం అశోక్, మాణిక్యం, శ్రీనివాస్‌ను ఘనంగా సన్మానించారు.

నేడు రగ్బీ జూనియర్స్ ఎంపికలు

మోపాల్(నిజామాబాద్‌రూరల్): మండలకేంద్రంలోని జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో ఆదివారం ఉదయం 10 గంటల నుంచి రగ్బీ జూనియర్స్ ఎంపికలు నిర్వహించనున్నట్లు అసోసియేషన్ అధ్యక్షుడు రెంజర్ల నరేశ్, కార్యదర్శి అబ్బయ్య, ఉపాధ్యక్షుడు రాజ్ గణేశ్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి గల క్రీడాకారులు ఎంపికలకు హాజరుకావాలని కోరారు. 2006 నుంచి 2008 సంవత్సరాల్లో జన్మించిన వారు అర్హులని, ఎంపికైన క్రీడాకారులకు ఈనెల 11 నుంచి 13వ తేదీ వరకు హైదరాబాద్‌లోని జింఖానా మైదానంలో నిర్వహించనున్న టోర్నీలో పాల్గొనే అవకాశం ఉంటుందని పేర్కొన్నారు.

క్రైం కార్నర్

అనుమానాస్పద స్థితిలో యువకుడి మృతి



శాకటి ప్రేమ్‌కుమార్ (ఫైల్)

డిచ్‌పల్లి: మండలంలోని ధర్మారం(బి) గ్రామ ఎంపీటీసీ శాకటి రాజమణి, మురళి దంపతుల కుమారుడు ప్రేమ్‌కుమార్ (32) శుక్రవారం రాత్రి అనుమానాస్పద స్థితిలో మృతి చెందినట్లు డిచ్‌పల్లి ఎస్సై యూ.మహేశ్ తెలిపారు. వివరాలు ఇలా ఉన్నాయి.. బయటకు వెళ్లి వస్తానని చెప్పి ప్రేమ్‌కుమార్ శుక్రవారం సాయంత్రం ఇంట్లో నుంచి వెళ్లాడు. రాత్రి 10 గంటలు దాటినా ఇంటికి రాకపోవడంతో కుటుంబసభ్యులు ఆందోళనకు గురై అతడి ఆచూకీ కోసం వెతుకగా అర్ధరాత్రి సమయంలో గొల్లపల్లి క్రాస్ రోడ్డు వద్ద ఉన్న ఎంఎస్‌ఆర్ బార్ పక్కన చెట్టు కింద చనిపోయి కనిపించాడు. పోలీసులు ఘటనాస్థలానికి చేరుకొని ప్రేమ్‌కుమార్ మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం జిల్లా కేంద్ర ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. మృతుడి తండ్రి శాకటి మురళి ఫిర్యాదు మేరకు అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు. అయితే ప్రేమ్‌కుమార్ రాత్రి చెట్టుకింద కూర్చుని మద్యం సేవిస్తుండగా పిడుగుపాటుకు గురై మృతిచెంది ఉంటాడని వైద్యులు అనుమానాలు వ్యక్తం చేశారు. పోస్టుమార్టం రిపోర్టు వచ్చిన తరువాతే స్పష్టత వస్తుందని ఎస్సై పేర్కొన్నారు. మృతుడికి భార్య ప్రేమలత, ఒక పాప ఉన్నారు.

భుజం తాకిందని కత్తితో దాడి



కత్తి దాడిలో గాయపడిన గంగాధర్

బోధన్‌టౌన్(బోధన్): భుజం తాకిందని ఆగ్రహంతో ఓ వ్యక్తి మరో వ్యక్తిపై కత్తితో దాడి చేసిన ఘటన బోధన్ పట్టణంలో కలకలం రేపింది. పట్టణంలోని పాత బస్టాండ్ సమీపంలో ఉన్న కల్లుబట్టి వద్ద శనివారం మధ్యాహ్నం జరిగిన ఘటనకు సంబంధించి పట్టణ సీఐ వీరయ్య, స్థానికులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి.. పాతబస్టాండ్ సమీపంలోని కల్లుబట్టీకి జీవన్‌సింగ్, గంగాధర్ వెళ్లారు. ఒకరు కల్లు తాగి బయటకు వస్తుండగా, మరొకరు కల్లు తాగేందుకు లోనికి వెళ్తుండగా, ఒకరి భుజాలు మరొకరికి తగిలాయి. ఇద్దరి మధ్య వాగ్వాదం చోటుచేసుకోగా కోపోద్రిక్తుడైన జీవన్‌సింగ్ తన వద్ద ఉన్న కత్తితో గంగాధర్ మెడపై దాడి చేశాడు. గంగాధర్‌కు గాయాలుకావడంతో స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. ఘటనాస్థలానికి చేరుకున్న పోలీసులు బాధితుడిని పట్టణంలోని ప్రభుత్వ ఆస్పత్రికి అక్కడి నుంచి మెరుగైన చికిత్స కోసం జిల్లా కేంద్రప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. గంగాధర్ కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

భార్య తరఫు బంధువులపై..

ఖలీల్‌వాడి: భార్య తరపు బంధువులపై భర్త దాడి చేసిన ఘటన నగరంలోని ఆరో టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలోని తాజ్ దాబా వద్ద చోటుచేసుకుంది. బాధితులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి.. బోధన్ నియోజకవర్గంలోని ఫతేపూర్ గ్రామానికి చెందిన సభాబేగంకు నగరంలోని ఆటో నగర్ ప్రాంతానికి చెందిన సయ్యద్‌అలీతో ఐదేళ్ల క్రితం వివాహం కాగా, ఒక బాబు, పాప ఉన్నారు. భార్యాభర్తల మధ్య విభేదాలు రావడంతో ఇప్పటికే పెద్దమనుషుల సమక్షంలో నాలుగు సార్లు పంచాయితీ జరిగింది. తొమ్మిది నెలల క్రితం మళ్లీ గొడవపడడంతో సభాబేగం తన తల్లిదండ్రుల వద్దకు వెళ్లిపోయింది. శనివారం మళ్లీ పెద్ద మనుషులు పంచాయితీ నిర్వహించి భార్యాభర్తలను కలిపారు. ఈ క్రమంలో మాటమాట పెరగడంతో మనసులో పెట్టుకున్న సయ్యద్ అలీ ఫతేపూర్ వెళ్తున్న వారిపై తాజ్ దాబా వద్ద కర్రలతో దాడి చేశాడు. ఈ ఘటనపై బాధితులు పోలీసులకు ఫిర్యాదు చేశారు.

భూ వివాదంపై ఫిర్యాదు



దాడిలో గాయపడిన చిన్న భూమన్న

జక్రాన్‌పల్లి: మండలంలోని కేశపల్లికి చెందిన తడ్పాకల చిన్న భూమన్న భూ వివాదంపై పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. కేశపల్లి గ్రామ రెవెన్యూ శివారులోని భూమి విషయంలో భూమన్నకు బాజాగౌడ్ అనే వ్యక్తితో కొంతకాలంగా వివాదం నెలకొంది. అధికారుల సర్వే తరువాత 1146 సర్వే నంబర్‌లోని భూమి పూర్తిగా తనదేనని తేలిందని భూమన్న ఫిర్యాదులో పేర్కొన్నాడు. భూమిని తమకు తెలియకుండా బాజాగౌడ్ దున్ని పంట సాగు చేశాడని, పంట ఎందుకు వేశావని అడిగితే కౌలు చెల్లిస్తానని చెప్పి ఇప్పటి వరకు చెల్లించలేదని తెలిపాడు. కౌలు డబ్బులు ఇవ్వాలని అడిగినందుకు తనపై బాజాగౌడ్ దాడి చేశాడని భూమన్న పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ ఘటనపై ఎస్సై తిరుపతిని వివరణ కోరగా.. ఫిర్యాదు అందిందని విచారణ కొనసాగుతోందని తెలిపారు.


చేపలు పట్టేందుకు వెళ్లి..



వివరాలు సేకరిస్తున్న పోలీసులు

భిక్కనూరు: మండలంలోని బస్వాపూర్ గ్రామంలోని పటేల్ చెరువులో చేపలు పట్టేందుకు వెళ్లి ఒకరు మృతి చెందినట్లు ఎస్సై సాయికుమార్ శనివారం తెలిపారు. గ్రామానికి చెందిన గంగాధారి స్వామి (46) పటేల్ చెరువులో చేపలు పట్టేందుకు వెళ్లాడు. అయితే, చేపల కోసం విసిరిన వల ప్రమాదవశాత్తు స్వామి కాళ్లకు చుట్టుకోవడంతో నీట మునిగి మృతి చెందాడు. మృతుడి భార్య సుధారాణి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

బాలుడిపై కుక్కలదాడి



గాయాలపాలైన ధీరజ్

జక్రాన్‌పల్లి: మండలంలోని చాంద్‌మియాబాగ్ తండాలో ధీరజ్(5) అనే బాలుడిపై కుక్కలు శనివారం దాడి చేశాయి. తండాకు చెందిన బానోత్ ధీరేందర్, రజిత దంపతుల కుమారుడైన ధీరజ్ తన పెద్దనాన్న ధారాసింగ్ ఇంటికి నడుచుకుంటూ వెళ్తుండగా రెండు కుక్కలు దాడి చేశాయి. ధీరజ్ తల నుంచి తీవ్రరక్తస్రావం కావడంతో స్థానికులు వెంటనే జిల్లా కేంద్ర ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

కరెంటు షాక్‌తో గేదె మృతి

గాంధారి(ఎల్లారెడ్డి): మండలంలోని తిమ్మాపూర్‌లో శనివారం సాయంత్రం విద్యుత్ షాక్‌తో గేదె మృతి చెందింది. కాయితి సావిత్రికి చెందిన గేదె మేతకు వెళ్లి సాయంత్రం వేళ తిరిగి వస్తుండగా రోడ్డు సమీపంలో ఉన్న ట్రాన్స్‌ఫార్మర్ వద్ద షాక్‌కు గురై మృతి చెందింది. మృతి చెందిన గేదె విలువ సుమారు రూ.50వేలు ఉంటుందని మహిళా రైతు సావిత్రి తెలిపారు. ఘటనా స్థలాన్ని విద్యుత్‌శాఖ లైన్‌మెన్ కొండల్‌రెడ్డి పరిశీలించి విద్యుత్‌సరఫరాను నిలిపివేశారు. ట్రాన్స్‌ఫార్మర్‌ను దూరంగా ఏర్పాటు చేయాలని గ్రామస్తులు కోరుతున్నారు.

యంత్రంతో పసుపు విత్తడం సులభం



బుస్సాపూర్‌లో ట్రాక్టర్ యంత్రంతో పసుపు విత్తుతున్న రైతులు

- తక్కువ సమయంలో ఎక్కువ విస్తీర్ణంలో పని పూర్తి
- ఎకరానికి రూ.4వేల కిరాయి

బాల్కొండ: ఖరీఫ్ సీజన్‌కు సంబంధించి విత్తనాలు విత్తడం పనులు ప్రారంభమయ్యాయి. తల్లి పంటగా పేర్కొనే పసుపు విత్తనాలను రైతులు విత్తుతున్నారు. అయితే, ట్రాక్టర్ యంత్రతో పసుపు విత్తనాలు విత్తడం సులభంగా ఉందని రైతులు అంటున్నారు. సాధారణంగా పసుపు పంటను అరకలతో బోయా వేసి విత్తుతారు. కానీ వ్యవసాయ రంగంలో విప్లవాత్మకమైన మార్పులు రావడంతో రైతులు మొత్తం యంత్రాలనే వినియోగిస్తున్నారు. ట్రాక్టర్ యంత్రం సహాయంతో పసుపు విత్తనాలు విత్తితే తక్కువ సమయంలో ఎక్కువ విస్తీర్ణంలో పని పూర్తవుతోందని అంటున్నారు. గతంలో అరకతో రోజంతా ఎకరం భూమిలో పసుపు విత్తనాలు విత్తేవారు. ప్రస్తుతం రెండు గంటల్లో ఎకరం పసుపు విత్తనాలను విత్తుతున్నారు. ఇందుకోసం ఎకరానికి రూ.4వేలు కిరాయి తీసుకుంటున్నారు. ఇందులో ట్రాక్టర్, విత్తనాలు విత్తే యంత్రం, నలుగురు కూలీలు వస్తారు. యంత్రంలో ఓ చక్రం ఉంటుంది. చక్రంలో పసుపు విత్తన కొమ్ములు వేస్తూ ఉండాలి. 18 ఇంచుల బోయలో విత్తనం పడుతోందని, పసుపు దిగుబడి బాగా వస్తుందని రైతులు అంటున్నారు. అరకతో కూడా అదే స్థాయిలో ఖర్చు అవుతున్నప్పటికీ సమయం ఆదా అవుతోందని, ట్రాక్టర్ యంత్రంతో 5 నుంచి 6 ఎకరాల విస్తీర్ణంలో పసుపు విత్తనాలు విత్తవచ్చని రైతులు అంటున్నారు.

అక్కడక్కడ అరక

పసుపు పంటను విత్తడం కోసం ఇతర ప్రాంతాల నుంచి అద్దెకు అరకలు కొన్ని ప్రాంతాల్లో వచ్చాయి. అయినప్పటికీ ప్రస్తుతం అరకతో అంతగా రైతులు విత్తనాలను విత్తడం లేదు. తక్కువ కాలంలో ఎక్కువ విస్తీర్ణంలో విత్తనాలు విత్తే అవకాశం ఉండడంతో ట్రాక్టర్ యంత్రం వైపే మొగ్గుచూపుతున్నారు. అరకతో ఎకరం భూమిలో పసుపు విత్తేందుకు ఒక రోజు పట్టగా, ట్రాక్టర్ యంత్రంతో రెండు గంటల్లో పూర్తవుతోంది.

తక్కువ టైంలో ఎక్కువ పని



ట్రాక్టర్ యంత్రంతో పసుపు విత్తడం ద్వారా తక్కువ టైంలో ఎక్కువ విస్తీర్ణంలో పని పూర్తవుతోంది. ఎకరం పసుపును రెండు గంటల్లో విత్తుకోవచ్చు. శ్రమ కూడ తక్కువగానే ఉంటుంది. ఎకరానికి రూ.4వేలు కిరాయి తీసుకుంటున్నారు.

– దొడ్డన్న గారి చిన్నయ్య, రైతు, బుస్సాపూర్

జోరుగా సాగుతున్న అరక



సోన్‌పేట్‌లో అరక కట్టిన రైతు

బాల్కొండ: రెండు రోజుల క్రితం కొన్ని ప్రాంతాల్లో భారీ వర్షం కురవడంతో అరక పనులు జోరుగా సాగుతున్నాయి. విత్తనాలు విత్తడంలో రైతులు బిజీ అయ్యారు. ఖరీఫ్‌లో ప్రధానంగా మక్క, పసుపు, సోయా పంటలను సాగుచేస్తారు. ప్రస్తుతం అధికంగా మక్క, పసుపు విత్తనాలను రైతులు విత్తుతున్నారు. కొందరు రైతులు యంత్రాలతో, మరికొందరు అరకతో విత్తనాలు విత్తుతున్నారు. మృగశిర కార్తె రావడంతో రైతులు సాగు పనుల్లో పడ్డారు. గత నెల 25 రోహిణి కార్తె నుంచి పనులను ప్రారంభించిన రైతులు వర్షం కురవడంతో జోరుపెంచారు. భూగర్భ జలాలు సమృద్ధిగా ఉండటంతో రైతులు ఏమాత్రం భయపడకుండా పనులు చేపడుతున్నారు. కాకతీయ కాలువ ద్వారా లీకేజీ నీటిని వదిలి కాలువల్లో నిల్వ ఉంచగా, రైతులు పంపు సెట్ల ఆధారంగా పంటలకు నీరందిస్తున్నారు. ఇలా ప్రత్యామ్నాయ వసతులు ఉండటంతో రైతుల ముందుగానే పసుపు పంటను విత్తుతున్నారు.

చదువుతోపాటు ఆటలూ ముఖ్యమే..



చిన్నారుల నృత్య ప్రదర్శన



చిన్నారులతో కామారెడ్డి ఎస్పీ సింధుశర్మ

కామారెడ్డి క్రైం: పిల్లలకు చదువుతోపాటు ఆటలూ ముఖ్యమేనని ఎస్పీ సింధుశర్మ అన్నారు. వేసవి సెలవుల సందర్భంగా జిల్లా కేంద్రంలోని శివ మందిర్‌లో జిల్లా పోలీసుశాఖ సిబ్బంది పిల్లల కోసం నిర్వహించిన సమ్మర్ క్యాంప్ శనివారం ముగిసింది. ఎస్పీ సింధుశర్మ ముగింపు కార్యక్రమానికి హాజరై మాట్లాడారు. రెండు వారాలపాటు కొనసాగిన సమ్మర్ క్యాంప్‌లో సుశిక్షితులైన టీచర్లను, కోచ్‌లతో పిల్లలకు డ్రాయింగ్, పెయింటింగ్, డ్యాన్స్, పాటలు, కరాటే వంటి కళల్లో శిక్షణ ఇప్పించినట్లు తెలిపారు. ఆటలతో మానసిక ఉల్లాసం కలగడంతో పాటు ఆత్మవిశ్వాసం పెరుగుతుందన్నారు. పిల్లలకు శిక్షణ ఇచ్చిన వంశీ ప్రసాద్‌గౌడ్, నవ్యశ్రీ, సంజుకుమార్, అనిల్ కుమార్, నవీన్‌కుమార్‌ను ఎస్పీ అభినందించారు. కార్యక్రమంలో ఏఎస్పీ నరసింహారెడ్డి, పట్టణ ఎస్‌హెచ్‌వో చంద్రశేఖర్‌రెడ్డి, ఎస్‌బీ సీఐ తిరుపయ్య, విద్యార్థులు, వారితల్లిదండ్రులు పాల్గొన్నారు.

దుబాయిలో పెద్దవాల్గోట్‌వాసి ఆత్మహత్య



శేఖర్ (ఫైల్)

సిరికొండ: ఉపాధి నిమిత్తం దుబాయికి వెళ్లిన మండలంలోని పెద్దవాల్గోట్ గ్రామానికి చెందిన వ్యక్తి అక్కడే ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. శనివారం గ్రామానికి మృతదేహం చేరుకోగా అంత్యక్రియలు నిర్వహించారు. గ్రామస్తులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి.. పెద్దవాల్గోట్‌కు చెందిన గజనబోయిన శేఖర్(45) ఉపాధి నిమిత్తం ఇరవై ఏళ్లుగా దుబాయికి వెళ్తున్నాడు. అక్కడ డ్రైవర్‌గా విధులు నిర్వర్తిస్తున్న శేఖర్ తాను పనిచేసే కార్యాలయంలోనే ఎవరూ లేనిసమయంలో గత నెల 30వ తేదీన ఆత్మహత్య చేసుకున్నాడు. పది రోజుల తరువాత శేఖర్ మృతదేహం శనివారం స్వగ్రామానికి చేరగా, కుటుంబ సభ్యులు, బంధుమిత్రులు అంత్యక్రియలు పూర్తి చేశారు. మృతుడికి తల్లిదండ్రులతోపాటు భార్య హేమలత, కూతురు, ఇద్దరు కొడుకులు ఉన్నారు. వేతనం, పని బాగానే ఉన్నప్పటికీ శేఖర్ ఎందుకు ఆత్మహత్య చేసుకున్నాడో తెలియడం లేదని కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరవుతున్నారు.

హైదరాబాద్‌లో గుజ్జుల్‌తండా వాసి..



సంజు (ఫైల్)

గాంధారి(ఎల్లారెడ్డి): మండల పరిధిలోని గుజ్జుల్‌తండాకు చెందిన సంజు(22) హైదరాబాద్‌లో శనివారం ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నట్లు తండావాసులు తెలిపారు. సంజుకు ఏడాది క్రితం పెళ్లి కాగా, బతుకుదెరువు కోసం హైదరాబాద్ వెళ్లి ఓ ప్రైవేటు కంపెనీలో పని చేస్తూ జీవిస్తున్నాడు. కుటుంబ కలహాల కారణంగా తాను నివాసం ఉంటున్న గదిలో ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడని తండావాసులు తెలిపారు. సంజు భార్య పనికి వెళ్లిన సమయంలో ఈ ఘటన చోటుచేసుకుందన్నారు.

బొల్లారం గ్రామానికి చెందిన యువకుడు..



హరీశ్(ఫైల్)

నాగిరెడ్డిపేట(ఎల్లారెడ్డి): మండలంలోని బొల్లారం గ్రామానికి చెందిన కోరబోయిన హరీశ్(24)అనే యువకుడు శుక్రవారంరాత్రి ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. ఘటనకు సంబంధించి పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి.. హరీశ్ ఆరునెలల క్రితం అదే గ్రామానికి చెందిన ఓ యువతిని ప్రేమించి పెళ్లి చేసుకున్నాడు. ప్రస్తుతం హైదరాబాద్‌లో ఉంటున్న భార్యాభర్తలు కల్యాణలక్ష్మి పథకానికి దరఖాస్తు చేసుకునేందుకు నాలుగు రోజుల క్రితం గ్రామానికి వచ్చారు. ఈ క్రమంలో శుక్రవారం రాత్రి గ్రామశివారులో ఉన్న తన వ్యవసాయభూమిలోని చెట్టుకు హరీశ్ ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. తమ కూతురుని బాగా చూసుకోవాలని హరీశ్‌కు అతడి భార్య తరపు వారు తరచూ చెబుతుండడంతో మనస్తాపానికి గురై ఆత్మహత్య చేసుకున్నాడని అతడి తండ్రి కొరబోయిన నాగయ్య పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై రాజు తెలిపారు.